కంఠంనేని రాధాకృష్ణమూర్తి

# ఎథీస్ట్



"నేను ఎథీస్ట్‌ని," అన్నాడు ఇస్రానీ.

తెల్లటి పైజామామీద నల్లగీరల నైట్‌గౌనుతో అతను చాలా హుందాగా సోఫాలో వెనక్కి చేరగిలబడి కూర్చున్నాడు. అతణ్ణి చూచిన వాళ్ళెవరూ అతణ్ణి భారతీయుడిక్రింద గుర్తించలేరు. గోధుమరంగు ఛాయలో ఇంత పొడుగున చిన్నికళ్ళు, సూటి పొడుగ్గా ముక్కు, సగం నుదుటిని దాచేస్తున్న వెంట్రుకలతో ఏ విదేశీయుడిలాగో కనిపిస్తాడు చూపులకు. .

"ఏ హైబ్రీడుగాడో కావచ్చు," అంటాడు శాస్త్రి అతనిమీద కోపంతో, తెలుగులో.

ఇస్రానీకి తెలుగురాదు. మా సంభాషణంతా కొంత హిందీలోను, మిగతాది ఇంగ్లీషులోనూ నడిచింది. ఇ.ఓ.టి. క్రేను ఎరక్షనుకుగాను ఇస్రానీ వాళ్ళ కంపెనీ తరఫున పనిచేయటానికి వచ్చాడు ప్రాజెక్టుకు. ఎరక్షను పూర్తయింది. ఆ రాత్రి అతను తిరిగి వెళ్ళిపోతున్నాడు. గుడ్‌బై చెప్పటానికి నేనూ, శాస్త్రీ అతని క్వార్టరుకు వెళ్ళాము. తెల్లవారుఝామున మూడింటికి వైజాగు పోతున్న ఒక ఎక్జిక్యూటివ్ ఇంజనీరు ఇస్రానీకి లిఫ్ట్ ఇస్తానన్నాడట.

రాత్రి పది దాటింది అప్పటికి. కాసేపు అవీ ఇవీ మాట్లాడుకున్నాము. మధ్యలో అనుకోకుండా మా సంభాషణ ఈ వేపుకు నడిచింది—దేవుడి మీదకు.

"నామట్టుకు నేను దేవుడున్నాడని, గట్టిగా విశ్వసిస్తాను," అన్నాడు శాస్త్రి.

"ఏమంటావు మూర్తీ?" నావేపు తిరిగి అన్నాడు ఇస్రానీ.

"నేను ఎగ్నాస్టిక్‌ని."

సన్నగా నవ్వాడు ఇస్రానీ. తర్వాత శాస్త్రివేపుకు తిరిగాడు.

సరేనే,నువ్వు "దేవుడనేవాడు ఉంటే ఈ సంగతిచెప్పు," అతనన్నాడు. "లోకంలో ఇంత అన్యాయం, ఇన్ని అసమానతలు ఎలా సాగుతున్నాయంటావు? ఒక మంచి మనిషికి కష్టాలు, వేదనలు, నిరాశలు అయితే ఒక రోగ్‌కి సుఖసంతోషాలు, ఉజ్వల భవిష్యత్తు ఏర్పరచబడ్డాయి. సమానార్హతలు గల ఇద్దరు వ్యక్తుల్లో ఒకడు గుడిసెలో బ్రతుకుతోంటే మరొకడు భవనంలో ఉంటున్నాడు. ఒకడు పల్లకిలో కూర్చుంటే రెండోవాడు దాన్ని మొయ్యాల్సివస్తుంది. ఒకడు కటికనేలమీద పండుకుంటూ, మండే తారురోడ్డుమీద ఉత్తకాళ్ళతో నడుస్తోంటే ఇంకొకడు పట్టుపాన్పులపై పవళిస్తూ ఎయిర్‌కండిషన్డ్ కార్లల్లో తిరుగుతున్నాడు. సాధారణంగా ఈ పేద వాళ్ళకే ఎక్కువ అర్హతలుండికూడా... నువ్వు చెప్పే దేవుడనేవాడు ఉంటే

ఇట్లాంటి అవకతవకలు జరుగుతాయంటావా ? జరగనిస్తాడంటావా ??"

"మైడియర్ ఇస్రానీ," శాస్త్రి అన్నాడు. "మన హిందూ ఫిలాసఫీ చెప్పే కర్మసిద్ధాంతం నీకు తెలియదనుకుంటాను. తెలిస్తే నువ్విలా మాట్లాడవు కూడా. మనిషి ఈ జన్మలో అనుభవించే కష్టసుఖాలు అతడు పూర్వజన్మలో చేసుకున్న పాపపుణ్యాలమీద ఆధారపడి ఉంటాయి. జీవి ప్రతిజన్మా ఒకదానితో ఒకటి ముడివేసుకోబడి ఉంటుంది. అట్లా ఆ జన్మ పరంపరల గొలుసుకట్టులో ఆఖరికి కర్మ పరిపక్వమయినప్పుడు ఆ జీవి జన్మరాహిత్యం చెంది ఈశ్వరునిలో లీనమవుతాడు..."

"బ్రేవో," చప్పట్లు కొట్టాడు ఇస్రానీ. "నువు చెప్పే కర్మ సిద్ధాంతాన్ని కొందరు "ఎస్కేపిజమ్" అన్న" పేరుతో పిలుస్తారు, నీకు తెలియదేమో. నా మట్టుకు నేను కర్మ సిద్ధాంతాన్ని ఒప్పుకోవాలంటే నా యీ సందేహాలకి సమాధానం కావాల్సి ఉంటుంది. ఏ జీవికికూడా క్రిందటి జన్మ స్పృహ ఉండటంద్వారా, అంటే చేసిన పాపాలు మళ్ళీ చేయకుండా సరిదిద్దుకోవటానికి అతనికి తర్వాత జన్మలో అవకాశం ఇవ్వబడటం లేదన్న మాట ! అట్లాంటప్పుడు చేసిన పాపాలే మళ్ళీ చేసుకుంటూ అలా అమాయకంగా అతడు జన్మరాహిత్యానికి దూరంగా సమాంతరరేఖలో సాగిపోవాల్సివస్తోంది. ఇది అన్యాయంకాదా? లేక ఈశ్వరుడు వీటిని ఆలోచించలేనంతటి మూర్ఖుడంటావా ?"

శాస్త్రి నవ్వాడు.

"నీతో వాదించటం నాకు చాతకాదు. కాని ఒక్కటి మట్టుకు చెప్పదల్చుకున్నాను. ఈశ్వరుడు దయామయుడు. సర్వాంతర్యామి. సర్వశక్తిమంతుడు. ఆయన లీలలు ఒక పట్టాన మనకు అర్థంకావు," అన్నాడు.

"అలా తప్పించుకోవటానికి ప్రయత్నించు." మధ్యలో అడ్డొచ్చాడు ఇస్రానీ. "తార్కికంగా చూద్దాము—ఈ లోకాన్ని భగవంతుడుసృష్టించాడంటారు కదా! ఎట్లా సృజించి ఉంటాడు? తనలో నుంచా లేక తన బయటనున్న వేరే పదార్థాన్నుంచా ? మొదటిది తీసుకుని తనలోంచి సృష్టించా డనుకుందాము. అంటే మనమంతా దైవాంశగలవాళ్ళమే అవుతాము. నువ్వు, నేను, కుక్క,నక్క, పిల్లి, నల్లి, ఇంట్లాంటివన్నీ...ఆ లెక్కన పక్కమీద నల్లి నన్ను కుట్టటం పవిత్ర కార్యమవుతుంది. ప్రతిగా కోపంతో నేను దాన్ని కాలిక్రిందవేసి నలిపి చంపటంకూడ పవిత్ర కార్యమే అవుతుంది. ఇట్లా విరుద్ధ కార్యాలు రెండు పవిత్రమైనవి కావటం అన్నది ఎంతటి అసమంజసమైన విషయమో నీకు మట్టుకు తెలియదా ?"

"నువు 'లా' చదవాల్సింది."

"ఇక పోతే రెండో వేపునుంచి చూద్దాము." మళ్ళీ అన్నాడు ఇస్రానీ- "భగవంతుడు ఈ జీవకోటిని తనలోంచి కాక తన బయటినుంచి సృష్టించా డనుకుందాము. ఇక్కడా అధర్మమే ఎదురవుతోంది. అంతటి దయామయుడనబడేవాడిచేత తయారు కాబడే ఈ సృష్టిలో ఈ హెచ్చుతగ్గు లేమిటి ?? కప్ప—పాము—గ్రద్ద, దరిద్రుడు—ధనికుడు, నవుకరు—యజమాని, నల్లవాడు—తెల్లవాడు, పిచ్చిమనిషి—మేధావి ; ఇట్లాంటివన్నీ పక్కపక్కన ఉంటూ, వ్యత్యాసాల్ని స్పష్టంగా కనబర్చుకుంటూ...ఇట్లాంటి అన్యాయాల్ని,అవివేకాల్నిఉంటే గింటే ఆ భగవంతుడు ప్రదర్శించగలడంటావా ? అట్లాంటి పక్షపాత బుద్ధికలవాడా అతను ? అయితే అట్లాంటివాణ్ణి మనం లెక్కచేయాల్సిన అవసరం ఉన్నదంటావా ??"

నేను మాట్లాడాను అప్పుడు.

"కాని మిస్టర్ ఇస్రానీ, మానవుడన్నవాడికి ఒక విశ్వాసమంటూ ఉండాలి. తన పరాజయాలకు కారణము, తన అసమర్థతకు మూలమూ ఓమానవాతీత శక్తిఅనీ, తనుత్త నిమిత్త మాత్రుడ్నేననీ అతను అనుకోగల్గాలి. అలా కానినాడు అతనిలో ఆత్మవిశ్వాసం నశించి నరాల బలహీనతకూ, యాంగ్జయిటీకీ దారితీస్తుంది."

అదోరకంగా చూసాడు ఇస్రానీ నావేపు.

"ఫ్రాయిడ్‌నీ, డార్విన్‌నీ నువ్వోసారి చదివిచూడు,"అన్నాడు క్లుప్తంగా.

తర్వాత శాస్త్రి తన క్వార్టరుకు వెళ్ళిపోయాడు. నేనుమాత్రం ఇస్రానీ రిక్వెస్ట్ చేయటంతో అక్కడే ఉండిపోయాను, పంటరిగాణ్ణి కావటంవల్ల. ఆ మాటా ఈ మాటా చెప్పకుంటూ మేము పండుకునేసరికి పన్నెండు దాటింది. ఉన్నది ఒక్కటే మంచం కావటంతో హోస్ట్‌గా ఇస్రానీ నాకు దాన్ని కేటాయించి తను మాత్రం ముందు స్టూలు మీదకు కాళ్ళుజాచుకుని సోఫాలో జేరగిలబడ్డాడు.

ఓ రాత్రివేళ నాకెందుకో హఠాత్తుగ మెలకువ వచ్చింది. లేచి కూర్చుని టైము చూచుకున్నాను. రెండున్నర. సోఫాలో పండుకున్న ఇస్రానీవేపు మళ్ళింది, నా దృష్టి. అతని నోట్లోంచి ఏదో వింతశబ్దం వెలువడుతోంది. మూలుగులా లేదది. భయంతో చేసే ఆర్తనాదంలా ఉంది. నిద్దట్లోనే అతను నిలువెల్లా వణికిపోతున్నాడు.

చప్పునలేచి అతడి భుజంమీద చేయి వేసాను.

"ఇస్రానీ ! మిస్టర్ ఇస్రానీ!!"

నా చేయి తగలగానే ఒక్క వెర్రి కేక పెట్టాడు. ఇస్రానీ, ఆ వెంటనే నేనూహించని రీతిలో అతని పిడికిలి వచ్చి నాగుండెల్ని తాకింది. ఆ హఠాత్పరిణామానికి నేను తూలి ఇవతలి మంచంమీద వెల్లకిలా పడ్డాను.

అతని ఈ వికృత చర్యకు నాకు బాగా కోపమొచ్చింది. లేచి వెళ్ళి రెండు చేతులతోనూ అతణ్ణి గట్టిగా కుదిపాను.

కీచుమని అరుస్తూ ఇస్రానీ కళ్ళు తెరిచాడు. అందమైన అతడి మొహం వికారంగా తయారయ్యింది. అతడి వొళ్ళంతా చెమటలు పట్టి ఉంది.

"వాట్ హేపెన్డ్ మిస్టర్ ఇస్రానీ?"

"**సమ్**థింగ్, సమ్‌థింగ్ హేపెన్డ్ ఐ కెనాట్ సే..."

**కూ**జాలోంచి చల్లటినీళ్ళు వొంపి అతగాడి చేతికిచ్చాను. కొద్దినీళ్ళు మొహం మీద చల్లుకుని మిగతా గ్లాసుడూ గటగట త్రాగాడు ఇస్రాని. అప్పటికి అతని మొహం కాస్త తేటగా తయారయ్యింది.

జరిగిన సంగతిని అతనికి చెప్పాను.

"సారీ ప్లీజ్," అన్నాడు తల వంచుకుని.

"ఫర్వాలేదుగాని అసలేం జరిగిందో చెప్పు."

కొద్దిసేపు ఇస్రానీ మాట్లాడలేదు. అతని మొహంలో దిగులు, భయం స్పష్టాస్పష్టంగ కనిపిస్తున్నాయి. ఆఖరుకు నిట్టూర్చి అతను విషాదంగా ఇలా అన్నాడు.


"చేసుకున్న పాపానికి ఫలితం అనుభవిస్తున్నాను."

అతనలా మాట్లాడటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. మనుషుల్లోని బలహీనాలు వాళ్ళ అన్‌కాన్షస్ సబ్కాన్షస్ వదిలి నప్పుడు బయటపడతాయి గాపును.




"మావాళ్ళు నాకు ఇష్టంలేని పెళ్ళి చేసారు," ఇస్రాని అన్నాడు. "నా భార్య అందమైనది కాదు. ఎత్తు పళ్ళు, మిడిగ్రుడ్లు, సన్నటి శరీరంతో చాలా అసహ్యంగా కనిపిస్తుంది. ఆమె అనాకారతనమంరా నాకు షీలాతో స్నేహమయ్యాక గ్రహింపులో కొచ్చింది. అప్పుడామె అంటే నా భార్య కడుపుతో ఉంది. ఆ రోజుల్లో షీలా తరచుగా మా ఇంటికి వస్తుండేది. ఆమె అలా రావటం నా భార్యకు గిట్టేదికాదు. ఏమాటకామాట చెప్పుకోవాలి, షీలా నాకు సరి అయిన జోడీ ... రోజూ ఏదో ఓ రూపంలో నా భార్య నాతో దెబ్బలాట పెట్టుకునేది. అసలే ఆమె శరీరం సన్నగా వికృతంగా ఉంటుంది. దానికితోడు మధ్య ఆ పొట్ట ముందుకు పొడుచుకువచ్చి మరింత దారుణంగా కన్పించేదామె.

అట్లాంటి వికృతమైన మనిషి చీటికీ మాటికీ దెబ్బలాట పెట్టుకుంటే నాకు ఎంత అసహ్యమేసేదో చెప్పలేను. ఒకో సారి సంసారంమీదే విరక్తి కలిగేది. నా భార్యది అసలే బలహీనమైన శరీరం దానికితోడు అవసరమైన మందులు, బలవర్థకాహారాలు ఇంట్లాంటి వాటి విషయంలో కావాలనే నేను అశ్రద్ధ



చేయటంతో ఆమె మరింత వాక్కిగ తయారయ్యింది. వొంట్లో నెత్తురులేక మొహం తెల్లగా పాలిపోయి కనిపించే దామె—

"ఒకరోజు షీలా మా ఇంటికి వచ్చి నప్పుడు నా భార్య మళ్ళీ దెబ్బలాట పెట్టుకుంది నాతో. షీలాని మొహంమీదే 'లంజ' అని అన్నది. నాకు తిక్కరేగి కొట్టటానికి చేయెత్తాను. 'ఏం,కొడ్తారా' అంది నాభార్య. అంతకుముందుఎప్పుడూ నేనామెమీద చేయిచేసుకోలేదు. 'కొట్ట లేననుకున్నావా ?' అన్నాను 'కొట్టండి చూద్దాం,' అందామె దెయ్యంలా మొహం పెట్టి. ఆమె సన్నటిమెడ, పుల్లలాంటి వొళ్ళు, మధ్యలో ఆ బానపొట్ట,ముఖ్యంగా ఆ ఎత్తు పళ్ళు, మిడిగుడ్లు, నాకు చాలా అసహ్యమేసింది ఆ అవతారాన్ని చూస్తున్నకొద్దీ. ఊహించి ఉండదు నేనా పని చేస్తానని. ఫెడీమని ఆమె మొహం మీద చరిచాను. అంతే, వెంటనే ఆమె వెనక్కు విరుచుకు పడిపోయింది. తిరిగి మళ్ళీ లేవనేలేదు. ఆమె చనిపోయింది.

చెప్పటం ఆపి ఇస్రానీ కాసేపు మౌనం వహించాడు. అతనా కథ ఎందుకు చెబుతోందీ నాకర్థం కాలేదు.

"అప్పట్నించీ ఆమె నన్ను హంట్ చేయసాగింది," మళ్ళీ చెప్పనారంభించాడు ఇస్రానీ. "ఆ మొహం, తెరుచుకున్న నోట్లోంచి కనిపించే ఆపార పళ్ళు, గుడ్లగూబకళ్ళు, బోదురుకప్పను మింగిన పాములా సన్నటి వొంటిమధ్య "పెద్ద పొట్ట...ఏరోజయినా నేను కాస్త ఎగ్జయిట్ అయిఉంటే, అదీ కొత్త ప్రదేశాల్లో, కొత్త పరిస్థితుల్లో...ఆ రాత్రి ఆమె రూపం నాకు కనిపిస్తుంది. నామీదపడి నా గొంతునొక్కుతూ ఉంటుంది..."

హఠాత్తుగ ఇస్రానీ కళ్ళల్లో మళ్ళీ భయం ప్రవేశించింది. కళా విహీనమైన అతడి మొహం మరింత వికృతంగా తయారయ్యింది. అతని పిడికిళ్ళుబిగుసు కున్నాయి.

"అంటే నువ్వనేది..."

"ఆమె ప్రేతం !"

నాకు ఆశ్చర్యమేసింది. రాత్రి అతను ఉపయోగించిన వాగ్ధాటి, నమ్మకమంతా ఏమయ్యాయి ?!

కొద్దిసేపయాక ఇస్రానీ లేచి మంచి నీళ్ళు త్రాగాడు. ఒక సిగరెట్ ముట్టించి గదిమధ్య అటు ఇటు పచార్లు చేయటం ప్రారంభించాడు. తిరిగి అతని మొహం తేట గాతయారయ్యింది. అంతకుముందు అతని మొహంలో కనిపించిన ప్రేత చ్ఛాయలు మచ్చుకయినా కనిపించటం లేదిప్పుడు.

చిన్నగా గొంతు సవరించుకున్నాను నేను.

"కాని మిస్టర్ ఇస్రానీ, రాత్రి నువ్వు దేవుడు లేడని వాదించావు ??"

ఇస్రానీ పెదాలపై సన్నటి చిరు నవ్వు కనిపించింది.

"అదంటావా—అదా—" చప్పున పెద్దగా నవ్వాడతను. "అవును, దేవుడు లేడన్నాను. నిజమే, కాని..."

అతనేమి చెబుతాడా అని, నేను వొళ్ళంతా చెవులు చేసుకున్నాను.

"కాని దెయ్యాలగురించి మాట్లాడ లేదు. అవునా ??"

ఉలికిపడ్డాను. వెంటనే నాకు పెద్దగా నవ్వాలనిపించింది. అప్పటికప్పుడు శాస్త్రివద్దకు వెళ్ళి ఈ సంగతి చెప్పా లనిపించింది. అంతలో ఇస్రానీ స్వరం మళ్ళీ వినిపించింది. అయితే ఈసారి చాలా నీరసంగా—

"అవును మూర్తీ, రీజనుకంటె ఇన్స్టింక్టు బలమైనది !